క్లుప్తంగా

సమష్టి కృషితో బీఆర్‌ఎస్ విజయం

జహీరాబాద్: జహీరాబాద్ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు కలిసి కట్టుగా పనిచేసి పార్టీ అభ్యర్థి కె.మాణిక్‌రావును గెలిపించుకున్నారు. టికెట్లు కేటాయించే ముందు ఆయన అభ్యర్థిత్వం విషయంలో పార్టీ నేతల్లో వ్యతిరేకత వచ్చింది. అభ్యర్థిని మార్చాలనే డిమాండ్ వచ్చినా కేసీఆర్ సిట్టింగ్‌లకే అవకాశం కల్పించడంతో చివరకు మాణిక్‌రావు అభ్యర్థిత్వమే ఖరారైంది. అభ్యర్థి గెలుపు కోసం పనిచేయాలని ఆదేశించడంతో పార్టీ శ్రేణులంతా ఏకతాటిపైకి వచ్చి గెలిపించుకున్నారు.

కాంగ్రెసేతరులకు మూడో విజయం

జహీరాబాద్: జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెసేతర పార్టీకి మూడో పర్యాయం విజయం దక్కింది. 1994లో తెలుగుదేశం పార్టీ తరఫున పోటీచేసిన సి.బాగన్న కాంగ్రెసేతర వ్యక్తిగా మొదటి సారి విజయం సాధించారు. 2018లో బీఆర్‌ఎస్ తరఫున కె.మాణిక్‌రావు విజయం సాధించారు. తాజా ఎన్నికల్లో కూడా ఆయనే విషయం సాధించడంతో కాంగ్రెసేతర వ్యక్తికి మూడోమారు గెలుపు అవకాశం దక్కినట్లయింది.

అందోల్ సెంటిమెంట్ రిపీట్

వట్‌పల్లి(అందోల్): అందోల్ నియోజకవర్గానికి రాష్ట్రంలోనే ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడ ఏ పార్టీ గెలిస్తే ఆ పార్టీనే రాష్ట్రంలో అధికారంలోకి వస్తుంది. సార్వత్రిక ఎన్నికల్లో ఈ సెంటిమెంట్‌పైనే ఇక్కడి నాయకులు బలంగా నమ్ముతారు. 1962 నుంచి అందోల్ నియోజకవర్గం ఎస్సీ రిజర్వు అయినప్పటి నుంచి ఈసెంటిమెంట్ కొనసాగుతోంది. తాజా ఎన్నికతో 15 సార్లు అందోల్‌లో గెలిచిన పార్టీనే అధికారంలోకి వచ్చింది. ఆదివారం వెలువడిన ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దామోదర రాజనర్సింహ గెలుపొందడంతో పాటు రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేపట్టనుండటంతో ఈ సెంటిమెంట్ మరోసారి రిపీట్ అయిందంటూ నియోజకవర్గ వ్యాప్తంగా చర్చ సాగుతుంది.

నేడు శివాలయాల్లో ప్రత్యేక పూజలు

రామలింగేశ్వర దేవస్థానంలో లక్ష పుష్పార్చన



పటాన్‌చెరు టౌన్: కార్తీక సోమవారం పురస్కరించుకొని పటాన్‌చెరులోని టోల్‌గేట్ సమీప రామలింగేశ్వర దేవస్థానం, జేపీ కాలనీలోని శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం, చైతన్యనగర్ కాలనీలోని మహాదేవుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. రామలింగేశ్వర దేవస్థానంలో లక్ష పుష్పార్చన, అన్నప్రసాద వితరణ, జేపీ కాలనీలోని శ్రీ ఉమామహేశ్వర దేవస్థానంలో స్వామివారిని పెరుగన్నంతో అలంకరించనున్నారు.

సమయానుకూలంగా బస్సులు నడపాలి



ఆర్టీసీ పరిరక్షణ కమిటీ పనితీరు పరిశీలిస్తున్న డిప్యూటీ ఆర్‌ఎం ద్వివేదీనం

నారాయణఖేడ్: ఆర్టీసీ సంగారెడ్డి జిల్లా డిప్యూటీ రీజినల్ మేనేజర్ ద్వివేదీనం ఆదివారం నారాయణఖేడ్ డిపోను తనిఖీ చేశారు. అనంతరం రాజీవ్‌చౌక్ వద్ద కొనసాగుతున్న ఆర్టీసీ పరిరక్షణ కమిటీ పనితీరును పరిశీలించారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా సకాలంలో బస్సులు నడపాలని డిపో మేనేజర్ మల్లేశయ్యకు సూచించారు. ఆయన వెంట సీఐ నర్సింహులు, పీఆర్వో పాండు, రాములు, శేఖర్, రవి ఉన్నారు.

ఆలయాల్లో పట్లోళ్ల ప్రత్యేక పూజలు



నారాయణఖేడ్: నారాయణఖేడ్ నియోజకవర్గం నుంచి శాసనసభ్యుడి విజయం సాధించిన విషయం తెలిసిన వెంటనే కాంగ్రెస్ అభ్యర్థి పట్లోళ్ల సంజీవరెడ్డి నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలోని దుర్గాభవానీ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి మొక్కుకొని పటాన్‌చెరు గీతం యూనివర్సిటీ కౌంటింగ్ కేంద్రానికి వెళ్లారు. గెలుపు ప్రకటన వెలువడిన వెంటనే గీతం యూనివర్సిటీలోగల ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేశారు.

ఉత్కంఠగా సాగిన కౌంటింగ్

- మొదట పోస్టల్ బ్యాలెట్లు లెక్కింపు
- ఉదయం 7 గంటలకే చేరుకున్న ఏజెంట్లు
- కౌంటింగ్ కేంద్రంలో అరకొర సదుపాయాలు
- అధికారుల తీరుపై మండిపాటు

మనూరు(నారాయణఖేడ్): నారాయణఖేడ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల లెక్కింపు ఆదివారం పటాన్‌చెరువు గీతం యునివర్సిటీ ఆవరణలో ఏర్పాటు చేశారు. కౌంటింగ్ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉత్కంఠగా జరిగింది. కాంగ్రెస్–బీఆర్‌ఎస్‌ల మధ్య నువ్వా..నేనా అన్నట్లు సాగింది. కాగా ఉదయం 7 గంటలకే ఆయా పార్టీల అభ్యర్థుల ఏజెంట్లు కేంద్రాలకు చేరుకున్నారు. ఖేడ్ కు సంబంధించి 17 రౌండ్లకు 18 టేబుళ్లను అధికారులు ఏర్పాటు చేశారు. ఈవీఎంల టేబుల్స్ వద్ద ఏర్పాటు చేసిన కుర్చీలు సరిపడా లేకపోవడంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టనట్లు వ్యవహరించారు. దాదాపు రెండు గంటల పాటు నిరీక్షించిన ఏజెంట్లు ఆర్వోఆర్‌ను నిలయదీయడంతో వెంటనే కుర్చీలు వేయించారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్ ఫోన్‌లను అనుమతించలేదు. పోలీసు అధికారులు మూడంచెలుగా అభ్యర్థులను తనిఖీచేసి లోనికి అనుమతించారు. 8 గంటలకు కౌంటింగ్ పరిశీలకుడు అనిల్ శర్మ, ఆర్వో ఎన్.వెంకటేశం, కౌంటింగ్ నోడల్ అధికారి కళింగ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో ఏజెంట్‌లు, పోలింగ్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పోస్టల్ బ్యాలెట్‌ల బాక్స్‌లు ఓపెన్ చేశారు. ఉదయం 8.30 గంటలకు ఈవీఎంలను ఆయా టేబుల్స్ వద్దకు పంపారు. ఓ వైపు పోస్టల్ బ్యాలెట్స్ మరోవైపు ఈవీఎంలను ఓపెన్ చేసి రౌండ్‌ల వారీగా లెక్కింపు చేపట్టారు. మొదట మూడు రౌండ్‌లు పూరయ్యాకే అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలు వెల్లడించారు.

తాగునీరు లేక..

పోలింగ్ ఏజెంట్‌లకు తాగునీటి సౌకర్యం లేపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే మంచినీళ బాటిల్స్ అందజేశారు.

ఉత్కంఠగా సాగిన లెక్కింపు

17 రౌండ్‌లకు సంబంధించి ప్రతీరౌండ్ ఉత్కంఠగా కొనసాగింది. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య స్వల్ప మెజార్టీ వ్యత్యాసం ఉండటంతో ఆయా పార్టీల నాయకులు, ఏజెంట్లు ఒత్తిడికిలో నైయ్యారు. దీంతో ఏ క్షణం, ఏ రౌండ్‌లో ఎలాంటి ఫలితాలు ఉంటాయోననే ఆసక్తిగా ఎదురు చూశారు. బీఆర్‌ఎస్ పార్టీకి సంబంధించి అనుకూల మండలాలు అయిన కల్హేర్, కంగ్టి, సిర్గాపూర్ మండాలు పూర్తవడంతో అప్పటికే వెయ్యి ఓట్ల పైచిలుకు మెజార్టీతో ఉన్న కాంగ్రెస్ నాయకులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా పెద్దశంకరంపేట, నారాయణఖేడ్, మనూరు ఉమ్మడి మడలాల్లోని ఆయా పోలింగ్ బూత్‌ల్లో కొద్దిమేర కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ వస్తుండటంతో 14వ రౌండ్ వరకు ఎదురు చూసిన బీఆర్‌ఎస్ నాయకులు కాస్త మెత్తబడటంతో కాంగ్రెస్ ఏజెంట్లలో ఉత్సాహం కన్పించింది. గెలుపు మాత్రం అభ్యర్థులతో దోబూచులాడింది.

నాలుగోసారి ఎమ్మెల్యేగా దామోదర

- అందోల్‌లో తన రికార్డును తానే బ్రేక్ చేసిన వైనం
- 28,193 ఓట్ల మెజార్టీతో గెలుపు



అంతారంలో పాండురంగ విఠలేశ్వర, రుక్మాబాయి దేవతామూర్తులకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే దామోదర రాజనర్సింహ

జోగిపేట (అందోల్): అందోల్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 16 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో అత్యధికంగా 9 సార్లు కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులు గెలుపొందగా, వీరిలో దామోదర్ కుటుంబ సభ్యులే ఆరు సార్లు విజయాన్ని సాధించారు. అయితే వీరిలో అత్యధిక మెజార్టీతో గెలుపొందిన అభ్యర్థి, అతి తక్కువ ఓట్లతో ఓటమి చెందిన అభ్యర్థి సి.దామోదర్ రాజనర్సింహ కావడం విశేషం. అందోల్ నియోజకవర్గంలో 2004 లో జరిగిన ఎన్నికలలో 24,846 ఓట్ల మెజార్టీతో గెలుపొందిన అభ్యర్థిగా రికార్డు ఉంది. మళ్లీ ఈ ఎన్నికలలో ఆ రికార్డును బ్రేక్ చేశారు. 28,193 ఓట్లతో గెలుపొందారు. దామోదర్ తండ్రి రాజనర్సింహ మరణానంతరం 1989 లో రాజకీయ రంగప్రవేశం చేసిన దామోదర్ రాజనర్సింహ టీడీపీ అభ్యర్థి మల్యాల రాజయ్యపై 3014 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆ తర్వాత 1994, 1998, 1999 వరుసగా మూడు ఓటమి చెందారు. 2004 లో 24,846 ఓట్ల మెజార్టీతో, 2009లో 2,906 ఓట్ల మెజార్టీతో బాబుమోహన్‌పై గెలుపొందారు. 2014, 2018 ఎన్నికల్లో ఓటమి చెందగా, 2023లో 28,193 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు.

ఆలయాల్లో ప్రతేక పూజలు

మునిపల్లి(అందోల్): అంతారం జీవన్ముక్త సంస్థానంలో పాండురంగ విఠలేశ్వర, రుక్మాబాయి దేవతామూర్తులతో పాటు జీవన్ముక్త మహారాజ్‌కు దామోదర రాజనర్సింహ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో దామోదర రాజనర్సింహ అందోల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందినట్లు ప్రకటించడంతో ఆలయాల్లో పూజలు చేశారు. అంతకుముందు బుదేరా, కంకోల్, మేళసంగ్యం, పెద్దచల్మెడ, మన్‌సాన్‌పల్లి, తాటిపల్లి గ్రామాలలో ఆయనను సన్మానించారు. ప్రతీ గ్రామంలో టపాసులు కాల్చి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు బుదేరా రాజేశ్వర్‌రావు, మాజీ జెడ్పీటీసీ అసత్ పటేల్, ఎంపీటీసీ పాండు, బుదేరా మాజీ ఎంపీటీసీ మనోహర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయోత్సవ సంబురాలు



ఝరాసంగంలో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

నారాయణఖేడ్: ఖేడ్‌లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు జరుపుకున్నారు. సంజీవరెడ్డి, మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్ నివాసాల వద్ద నాయకులు, కార్యకర్తలు, అభిమానులు టపాసులు కాలుస్తూ స్వీట్లు పంచిపెట్టారు.

కల్హేర్‌లో..

ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్‌ను కాంగ్రెస్ దాటింది. ఇక్కడ నారాయణఖేడ్ అభ్యర్థి డాక్టర్ పి.సంజీవరెడ్డి గెలుపొందగా కల్హేర్‌లో ఆపార్టీ శ్రేణులు విజయోత్సవ సంబురాలు జరుపుకున్నారు. సంబురాల్లో పార్టీ మండల అధ్యక్షుడు పోచయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మనూరులో..

కాంగ్రెస్ అభ్యర్థి పట్లోళ్ల సంజీవరెడ్డి విజయం సాధించడతో మనూరు ఉమ్మడి మండలమైన మనూరు, నాగల్‌గిద్ద మండలాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు టపాసులు కాల్చి, నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

సదాశివపేటలో..

పట్టణంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు పట్నం సుభాష్‌ల ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకొన్నారు.

ఝరాసంగం(జహీరాబాద్): అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్‌కు మెజార్టీ సీట్లు రావడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. ఆదివారం మండల కేంద్రమైన ఝరాసంగం ప్రధాన చౌరస్తాలోలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్ రావు పాటిల్ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి, మిఠాయి పంచిపెట్టారు.

మొదటి రౌండ్ నుంచి బీఆర్‌ఎస్‌కు ఆధిక్యత

జహీరాబాద్: ఓట్ల లెక్కింపులో మొదటి రౌండ్ నుంచి బీఆర్‌ఎస్ హవా కొనసాగింది. మొదటి రౌండ్‌లో మాణిక్‌రావుకు 148 ఓట్లు రాగా, రెండో రౌండ్‌లో 637 వచ్చాయి. 3వ రౌండ్‌లో 858, 4వ రౌండ్‌లో 1,136, 6వ రౌండ్‌లో కొంచెం తగ్గినా 681 ఓట్ల ఆధిక్యతలో కొనసాగారు. ప్రతీ రౌండ్‌లోనూ మాణిక్‌రావు కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్‌పై ఆధిక్యంలో కొనసాగారు. బీఆర్‌ఎస్‌కు న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్, జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో ఆధిక్యత లభించింది. గత ఎన్నికలతో పోల్చితే బీజేపీకి 6 వేల ఓట్లు తక్కువగా వచ్చాయి. ఈ ఓట్లు బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా పోలయినట్లు భావిస్తున్నారు. యువత ఓట్లు సైతం చివరి నిమిషంలో బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా పోలయినట్లు పోలింగ్ సరళినిబట్టి తెలుస్తోంది.

ఝరాసంగంలో కాంగ్రెస్ ముందంజ

ఝరాసంగం(జహీరాబాద్): జహీరాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందిన బీఆర్‌ఎస్ అభ్యర్థి మాణిక్ రావు స్వగ్రామం ఝరాసంగంలో కాంగ్రెస్ ఆధిక్యం చూపింది. గ్రామంలో 2,166 పోలవ్వగా కాగా బీఆర్‌ఎస్ కు 903 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 1,093 ఓట్లు వచ్చాయి. దీంతో కాంగ్రెస్ 190 ఓట్ల మెజారీతో ముందంజలో నిలిచింది. ఝరాసంగం మండలం మొత్తంగా బీఆర్‌ఎస్‌కు 250కిపైగా ఓట్లు వచ్చాయి.

స్వగ్రామంలో మూడో స్థానం



సంగప్ప

కంగ్టి(నారాయణఖేడ్): నారాయణఖేడ్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన జనవాడె సంగప్ప స్వగ్రామం కంగ్టి మండలంలోని చౌకన్‌పల్లి. స్వగ్రామంలో పోలైన ఓట్ల లెక్కింపులో ఈయన మూడో స్థానంలో నిలిచారు. గ్రామంలో 1,084 మంది ఓటర్లు ఉండగా, 914 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. సంగప్పకు 169 ఓట్లు వచ్చినట్లు సమాచారం. మొత్తం పోలైన ఓట్లలో 18.5 శాతం ఓట్లు సాధించారు. కాగా నియోజకవర్గం పరిధిలో సంగప్పకు మొత్తం 7,694 ఓట్లు పోలయ్యాయి.

గురుకుల విద్యార్థుల ఎంపిక

జిన్నారం(పటాన్‌చెరు): ఈనెల 5 నుంచి గద్వాల్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్రికెట్ ఎస్‌జీఎఫ్‌మీట్‌కు జిన్నారంలోని గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మధుసూదన్ ఆదివారం తెలిపారు. అండర్ 17 రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో విద్యార్థులు ప్రతాప్, జశ్వంత్ పాల్గొననున్నారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు.

ప్రజాతీర్పును గౌరవిస్తున్నా: క్రాంతికిరణ్



మాట్లాడుతున్న క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్): అసెంబ్లీ ఎన్నికల్లో అందోల్ ప్రజాతీర్పును గౌరవిస్తున్నానని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. ఆదివారం వెలువడిన ఫలితాలపై మాట్లాడారు. గెలుపోటములు సహజమన్నారు. తన ఓటమికి గల కారణాలను పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సమీక్షించుకుంటామని తెలిపారు. ఐదేళ్లపాటు ప్రజాసేవ చేసేందుకు అవకాశం కల్పించిన అందోల్ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. ఈ ఎన్నికల్లో తనకు సహకరించిన పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు అధైర్య పడొద్దని అండగా ఉంటానన్నారు. తనకు ఓటేసిన ప్రతీ ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో టీఎస్‌టీపీసీ చైర్మన్ భిక్షపతి, మాజీ జెడ్పీ చైర్మన్ బాలయ్య, జోగిపేట మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చరిత్రను తిరగరాసిన గ్రామాలు

మనూరు(నారాయణఖేడ్): అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కల్హేర్ మండలంలోని పలు గ్రామాలు ఈసారి చరిత్రను తిరగ రాశాయని ఆయా పార్టీల మండల నాయకులు పేర్కొన్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి స్వగ్రామమైన ఖానాపూర్‌లో కాంగ్రెస్ పార్టీకి 193 ఓట్లు రాగా, బీజేపీకి 15 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 656 వచ్చాయి. గతంలో కాంగ్రెస్ పార్టీకి సింగిల్ డిజిట్ రాలేదని స్థానిక నాయకులు తెలిపారు. కాగా కిష్టాపూర్‌లో కాంగ్రెస్ పార్టీకి 585 ఓట్లు రాగా బీఆర్‌ఎస్ పార్టీకి 1,119 ఓట్లు వచ్చాయి. గతంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేయగా 340 ఓట్లు కాంగ్రెస్‌కు వచ్చాయని, నాటి నుంచి నేటివరకు ఇతర పార్టీకి అధిక ఓట్లు రాలేదన్నారు.

కాంగ్రెస్‌కు లీడ్ ఇచ్చిన బీబీపేట్

గతంలో టీడీపీకి, ప్రస్తుతం బీఆర్‌ఎస్‌కు గత కొన్ని దశాబ్దాలుగా కంచుకోటగా ఉన్న బీబీపేట గ్రామం ఈ మారు చరిత్రను తిరగరాసింది. కాంగ్రెస్ పార్టీకి 700 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్‌కు 607 ఓట్లు వచ్చాయి. ఇదే మండలంలోని మహాదేవ్‌పల్లి కాంగ్రెస్ పార్టీకి మొదటి సారిగా 159 ఓట్లు పోలయ్యాయని స్థానికులు తెలిపారు.

ఆలయానికి పోటెత్తిన భక్తులు



సత్యనారాయణ స్వామి వ్రతం చేస్తున్న భక్తులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడ గ్రామంలోని భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి దేవాలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. భక్తులు స్వామివారికి అభిషేకాలు, మహిళలు అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చనలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. దేవాలయ నిర్వాహకుడు సోమయ్య దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పరువు నిలుపుకొన్న కాంగ్రెస్



ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

మండలంలో 95 ఓట్ల మెజార్టీ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం లభించింది. కేవలం 95 ఓట్ల అతి స్వల్ప మెజార్టీ సాధించింది. గతంలో రెండు పర్యాయాలు నిర్వహించిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మండలం నుంచి మంచి మెజార్టీ లభించగా 2018లో జరిగిన ఎన్నికల్లో మాత్రం బీఆర్‌ఎస్‌కి మెజార్టీ లభించింది. ఆదివారం వెలువడ్డ శాసన సభ ఎన్నికల ఫలితాల్లో మండల ఓటర్లు కాంగ్రెస్‌కు స్వల్ప మెజార్టీని కట్టబెట్టారు. 2018లో మండలంలో పార్టీకి అధిక మెజార్టీ ఉండేది. రెండు మార్లు కాంగ్రెస్ అభ్యర్థి గీతారెడ్డికి న్యాల్‌కల్ మండలం మెజార్టీ ఇచ్చి ఆమె గెలుపులో మండలం కీలక పాత్ర పోషిస్తూ వచ్చిన విషయం తెలిసిందే. 2018లో జరిగిన ఎన్నికల్లో మండల ఓటర్లు అందుకు భిన్నంగా తీర్పు ఇచ్చారు. గీతారెడ్డి కంటే మాణిక్‌రావుకు 6,244 ఓట్లు అధిక్యం లభించింది. ఈసారి బీఆర్‌ఎస్‌కు మెజార్టీ రాలేదు. కాంగ్రెస్ పార్టీకి కేవలం 95 ఓట్ల ఆధిక్యం లభించింది.

ప్రజాతీర్పుపై విశ్లేషిస్తాం

ఖేడ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తానని నారాయణఖేడ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం రెండో స్థానంలో నిలిచిన ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. తాను ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి విశేషంగా కృషిచేశానని, అయినప్పటికీ ప్రజలు ఇచ్చిన తీర్పుపై విశ్లేషణ చేసుకొని వారికి అందుబాటులో ఉంటానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తామని చెప్పారు. ఎన్నికల్లో తనకోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ఇచ్చిన ఈ తీర్పును గౌరవిస్తానని అన్నారు. ఆయన వెంట ఖేడ్ మండల పార్టీ అధ్యక్షుడు పరమేశ్వర్, మాజీ ఎంపీటీసీ ముజమ్మిల్, నగేష్, పార్శెట్టి సంగప్ప, గుండు వెంకట్ రాములు పాల్గొన్నారు.

అభ్యర్థుల స్వగ్రామాల్లో ఎవరికెన్ని ఓట్లు?

నారాయణఖేడ్: శాసనసభ ఎన్నికల్లో నారాయణఖేడ్ అసెంబ్లీ స్థానానికి పోటీచేసిన ప్రధాన పార్టీల అభ్యర్థుల స్వగ్రామాల్లో ప్రజలు వారికి అనుకూలంగానే ఓటేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులకు స్వగ్రామాల్లో అనుకూలంగా ఉండగా బీజేపీ అభ్యర్థి జన్‌వాడే సంగప్పకు ప్రతికూలంగా ఓటేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎం.భూపాల్‌రెడ్డి స్వగ్రామమైన కల్హేర్ మండలం ఖానాపూర్‌లో 1,043 ఓట్లకుగాను 900 ఓట్లు పోలయ్యాయి. బీఆర్‌ఎస్‌కు 656, కాంగ్రెస్‌కు 193 ఓట్లు రాగా కాంగ్రెస్ కంటే బీఆర్‌ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డికి 463 ఓట్లు అధికంగా లభించాయి. కాంగ్రెస్ అభ్యర్థి పట్లోళ్ల సంజీవరెడ్డి స్వగ్రామమైన పంచగామలో 852 ఓట్లకుగాను 779 ఓట్లు పోలయ్యాయి. ఇందులో కాంగ్రెస్ పార్టీకి 489 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్‌కు 290 వచ్చాయి. బీఆర్‌ఎస్ కంటే కాంగ్రెస్ అభ్యర్థి సంజీవరెడ్డి 199 ఓట్లు అధికంగా దక్కించుకున్నారు. బీజేపీ అభ్యర్థి జన్‌వాడే సంగప్ప స్వగ్రామం కంగ్టి మండలం చౌకాన్‌పల్లిలో 1,084 ఓట్లకు గాను 914 ఓట్లు పోలయ్యాయి. ఇందులో బీజేపీ అభ్యర్థి సంగప్పకు 158 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్‌కు 374, కాంగ్రెస్‌కు 326 ఓట్లు లభించాయి. ఈ గ్రామంలో బీజేపీ అభ్యర్థి సంగప్ప కంటే బీఆర్‌ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి 216 ఓట్లు అధికంగా పొందారు. కాంగ్రెస్ అభ్యర్థికి 168 ఓట్లు వచ్చాయి.

ఇది ప్రజా విజయం

ఖేడ్ కాంగ్రెస్ అభ్యర్థి పట్లోళ్ల సంజీవరెడ్డి



కౌంటింగ్ కేంద్రం వద్ద ఉన్న హనుమాన్ ఆలయంలో పూజ చేస్తున్న డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్: తన విజయం ప్రజా విజయమని నారాయణఖేడ్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందిన డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శాసన సభ్యుడిగా గెలుపొందిన సందర్భంగా ఆదివారం 'సాక్షి'తో మాట్లాడారు. తమకు ప్రచారం చేయడానికి చాలా తక్కువ సమయం ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి తన గెలుపుకోసం కృషి చేశారన్నారు. అధికారపార్టీ డబ్బు, మద్యంతో పలువురు ఓటర్లను ప్రలోభపెట్టినప్పటికీ ప్రజలు మాత్రం తమవైపే ఉన్నారన్నారు. అధికార పార్టీ వారు తమ కార్యకర్తలపై దౌర్జన్యం చేయడానికి తోడు కొన్ని చోట్ల ప్రచారాన్ని కూడా అడ్డుకున్నారని, అయినప్పటికీ ప్రజలు తమను, కాంగ్రెస్ పార్టీని ఆదరించారని తెలిపారు. ఈ విజయం ప్రజలకు అంకితం చేస్తామని, తమ విజయానికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషికి తోడు ప్రజలు ఆదరించారన్నారు. తమ తండ్రి దివంగత కృష్ణారెడ్డి స్ఫూర్తితో నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానన్నారు. విజయానికి కృషి చేసిన కార్యకర్తలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్‌ఎస్ సంబరాలు



జిన్నారంలో నినాదాలు చేస్తున్న నాయకులు



సదాశివపేటలో జీపు ర్యాలీ

సదాశివపేట(సంగారెడ్డి): సంగారెడ్డి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా చింతా ప్రభాకర్ విజయం సాధించడంతో ఆదివారం సదాశివపేట పట్టణ వ్యాప్తంగా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు టపాసులు కాల్చి, స్వీట్లు పంచిపెట్టి సంబురాలు జరుపుకున్నారు. పట్టణంలోని దుర్గా భవాని మందిరం, బస్టాండ్, బసవచౌక్, సంగమేశ్వర, బసవేశ్వర, గాంధీ చౌక్ ప్రాంతాల్లో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, చింతా ప్రభాకర్‌కు అనుకూలంగా నినాదానాలు చేశారు. బసవేశ్వర మందిరం నుంచి యువకులు బీఆర్‌ఎస్ పార్టీ జెండాలతో జీపు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్లు ఆకుల శివకుమార్, పార్టీ నాయకులు ముద్దనాగు, గందిగరాజు, అన్మిశెట్టి మల్లేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోహీర్(జహీరాబాద్): జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి కె.మాణిక్‌రావు విజయం సాధించగా ఆపార్టీ శ్రేణులు ఆదివారం సంబురాలు జరుపుకున్నాయి. బాణాసంచా కాల్చి, మిఠాయి పంచిపెట్టారు.

సంగారెడ్డిలో..

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా చింతా ప్రభాకర్ విజయం సాధించడంతో మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సంబురాలు జరుపుకొన్నారు. నాగపూర్, ఇస్మాయిల్ ఖాన్ పేట్, పసల్వాది తదితర గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా నృత్యాలు చేశారు.

ఝరాసంగం(జహీరాబాద్): జహీరాబాద్ ఎమ్మెల్యేగా బీఆర్‌ఎస్ అభ్యర్థి కె.మాణిక్ రావు గెలుపొందటంతో ఆ పార్టీ మండల నేతలు సంబరాలు జరుపుకున్నారు. ఆదివారం మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు వివిధ గ్రామాల్లోని ప్రధాన చౌరస్తాల్లో టపాసులు కాల్చారు. కేసీఆర్, మాణిక్ రావు జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు.

జిన్నారం(పటాన్‌చెరు): బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హ్యాట్రిక్ విజయాన్ని సాధిచంటంతో ఆదివారం జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో బీఆర్‌ఎస్ నాయకులు సంబురాలను జరుపుకున్నారు. టపాసులను కాలుస్తూ కేసీఆర్, మహిపాల్‌రెడ్డి జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు.